'కరుణా' అన్నాను తలుపు తట్టి.

'ఎవరూ' అంటూ తలుపుతీసి, 'నువ్వా అన్నయ్యా' అంటూ కుర్చీ చూపించింది కరుణ.

'ఒక్క క్షణం ఆగు. కాఫీ తెస్తాను' అంటూ లోపలికి పోబోతున్న ఆమెని వారించాను. 'నాక అవుతుంది. వెళ్లిపోవాలి. నీ చేతి కాఫీ తాగటం నాక ఇష్టమే గాని నాకు టైము లేదు' అన్నాను.

'ఆలస్యం కాదులే' అంటూ లోపలికి వెళ్లి వెంటనే ఫ్లాస్కుతో తిరిగి వచ్చింది. గ్లాసులో కాఫీ పోసి ఇచ్చింది. తృప్తిగా తాగాను. మనస్సు ప్రశాంతంగా హాయిగా ఉంది. ఎండలో నడిచివచ్చిన అలసట పూర్తిగా మాయమయింది. ఆమెతో చెప్పినట్లు నిజంగానే నాకు అర్జంటు పని ఉంది కాని వెంటనే వెళ్లాలనిపించటం లేదు.

'అంతా కులాసాయేనా ? దర్శనాల్లేవు' అంది కరుణ.

'కులాసాయే గాని ఒక శుభవార్త తెచ్చాను. మనకి హైస్కూలు గ్రాంటు వచ్చింది. ఇప్పుడే వార్త వచ్చింది' అన్నాను ఉత్సాహంగా.

'తెలుసు' అంది కరుణ.

నేను ఆశ్చర్య పడిన మాట వాస్తవం. ఈ వార్త ఇంకా ఎవరికీ తెలిసే అవకాశం లేదు. కరణం గారికీ నాకూ మాత్రమే తెలుసు. కరుణ మూడో ఫారం చదివింది. తర్వాత చదువు ఈ వూళ్లో లేదు. వూరికి ఆరుమైళ్ల దూరంలో ఉన్న పట్నం వెళ్లి చదువుకో వలసి వచ్చింది. అది చాలా పెద్ద ఇబ్బంది అని చెప్పక తప్పదు. అందులోనూ కరుణ లాంటి పెద్దింటి అమ్మాయిలకి దాదాపు అసాధ్యం. వూరి నించి పట్నం వెళ్లటం, అక్కడ ఆమెకి వసతి, ఎవరింట్లో ఉండాలన్న ప్రశ్న, ఈడొచ్చిన పిల్లని మరొకళ్ల ఇంట్లో ఉంచకూడదన్న భావం— ఇవి ఆమె ముందు చదువుని కష్టతరం— దాదాపు అసాధ్యంగా— చేశాయి. వూళ్లో చాలా మంది తమ

పిల్లల చదువుకి అలాగే స్వస్తి చెప్పుకున్నారు.

హైస్కూలు ఊళ్లోనే పెట్టించాలన్న ఊహని ఒక నాడు కరణంగారు వ్యక్తం చేశారు. ఆ విషయం ముందు నాతో చెప్పాడు. అసలాయనకి ఏ ఊహ కలిగినా ముందు నాతోటే చెబుతారు. మాకు కరణంగారు దూరపు బంధువు. కాని వారి కుటుంబం అంతటికీ సన్నిహితుడను నేను. ఆయనని బాబాయి అని పిలుస్తాను. బంధుత్వాల విలువలు తగ్గి పోతున్న ఈ రోజులలో కూడ ఆయన మమ్మల్ని మర్చిపోలేదు. మా ఇళ్ల మధ్యరాక పోకలు కూడా ఎక్కువగానే ఉండేవి. పండుగలు పబ్బాల విషయంలో అవి మరింత హెచ్చుగా ఉండేవి. పెద్దపెద్ద వ్యవహారాల్లో కూడా ఆయన సలహా లేనిదే ఏ పనీ చెయ్యరు. పశువుల్ని బేరం చెయ్యడం దగ్గర నించీ ఆయనకుమార్తె వివాహ ప్రయత్నం వరకూ కూడ ఆయన నన్ను సంప్రదిస్తారు. ఆస్తి పాస్తుల్లో సమవుజ్జీ కాక పోయినా ఆయన మా కిస్తున్న గౌరవానికి మాకు ఆనందం కలిగేది. దాని ఫలితంగా స్కూలు మంజూరు విషయం లోను తదితర విషయాల్లోను నా సహకారం ఆయనకి లభ్యం అయింది.

ఆయన స్కూలు ఊహ వ్యక్తం చెయ్యగానే నేనూ నా అంగీకారం తెలిపి నా సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చాను. కరణంగారి పని అయితే నేను నా తలతో చేస్తాను. అందులో ఊరి బాగోగులు కూడా ఉన్నాయి కాబట్టి నా సర్వ శక్తులా ధారపోశాను. ఇద్దరం నడుం కట్టాక కార్యం కష్టం కాలేదు. కరణంగారు తీసుకున్న ఉత్సాహం, చొరవ అపూర్వం. పెద్దలని ఒప్పించి ప్రోత్సహించడం దగ్గర నించి విరాళాలు పోగుచేసి అధికారులని మెప్పించి మంజూరు చేయించేదాకా ఆయన విశ్రమించలేదు. స్కూలు గ్రాంటు అవుతున్న దన్న విషయం నిన్ననే నిశ్చయంగా తెలిసింది. అయిం దన్న విషయం ఇప్పుడే తెలిసింది ఆ సంగతి ఎవ రికీ తెలీదు, నాకూ కరణంగారికీ తప్ప. ప్రత్యేకించి ఇంట్లో ఆడవాళ్లకి తెలిసి ఉండటానికి వీలులేదు.

'ఎలా తెలుసు ?' అన్నాను ఆశ్చర్యంగా కరుణతో. ఆమె ఇంకా ఆశ్చర్యంగా చూసింది.

'నాన్న గారికి ఆ సలహా ఇచ్చింది నేనే కదా !' అంది.

'ఏమిటీ' అన్నాను ఆశ్చర్యంగా.

'అవును నాన్నగారు పట్నంలో నా చదువు కోసం ప్రయత్నించి బసకుదరక, కుదిరినా నన్ను మరో చోట ఉంచలేక మధన పడి, బాధపడి ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చిన నన్ను ఇంక చదివించనని చెప్పినప్పుడు స్కూలు మన ఊళ్లోనే పెట్టించుకో వచ్చుననీ, అదెలా సాధ్యమో కూడా నాన్నగారికి సూచించాను నేను' అంది.

నాకు నిజంగా చాలా సంతోషం కలిగింది. నాకిందుకే కరుణంటే ఇంత ఇష్టం. కరుణ అందరు ఆడవాళ్ల లాటిదీ కాదు. తన జీవిత గమ నాన్ని తనే నిర్ణయించుకుంటుంది. అందరు ఆడ వాళ్లల్లా విధికి వదలెయ్యదు. తనకి ఒకటి మంచి దనిపిస్తే అది సాధించేందుకు ఆమె సర్వప్రయ త్నాలూ చేస్తుంది. అవసరం అయితే సాహసం అనిపించుకో దగ్గ కార్యాలు చేస్తుంది. సామాన్యంగా అన్నీ ఆమెకి అనుకూలంగానే పరిణమిస్తాయనే ఆమె నమ్మకం.

వాళ్ల అమ్మ అనేది 'దీనిక తన్నిలా, అమ్మోళ్ల లేరనే దిగులు నాకు లేదు. దాని బ్రతుకు అది చూసుకో గలదు' అని.

కరుణతో నాకు చిన్నప్పట్నించీ పరిచయం. ఇద్దరం కలిసి ఆడుకునే వాళ్లం. కథలు చెప్పుకునే వాళ్లం.. సరదాగా తిరిగే వాళ్లం. రోజల్లా కలిసి ఉండే వాళ్లం. కరుణకన్నా నేను అయిదేళ్లు పెద్ద. అయినా నేను కరుణతోటే కలిసి తిరిగే వాడిని. మా ఇద్దరి మధ్య వయస్సు భేదం అడ్డురాదు. ఇప్పటికీ బయట ఎంత పెద్ద మనిషి నయినా కరుణ దగ్గర చిన్న పిల్లవాడినే.

కరుణ, కరణంగారి ఏకైక పుత్రిక. చదువు లోను, అందంలోనూ ఊరికి మాణిక్యం లాగా ఉంటుంది.. కరణంగారు ఈమెని చూసి గర్వపడే వాటిలో ఈ రెంటినీ మించి వినయం, వివేకం, ధైర్యం కూడా ఉన్నాయి.

'ఏమిటి ? అలా పరధ్యానంలో పడ్డావు ?' అంది కరుణ.

'ఏం లేదు. మన చిన్నప్పటి విషయాలు గుర్తుకు వచ్చాయి' అన్నాను.

హైస్కూలు స్థాపనకి సర్వసన్నాహాలూ జరిగి పోయాయి. స్కూలుకి భవనం, ఆటస్థలం నిర్ణయ మయి పోయాయి. విద్యార్థుల నుండి దరఖాస్తులు కూడా వచ్చాయి. టీచర్ల నియామకం కూడా జరిగి పోయింది. దాదాపు అంతా సవ్యంగా జరిగి పోయింది. ఒకసారి మాత్రం వినీ వినపడకుండా చిన్న విమర్శ వినపడింది. కరణంగారు తన అవసరం కాబట్టి స్కూలు విషయంలో ఇంత శ్రద్ధ తీసు కున్నారనీ, లేకపోతే తీసుకునేవారు కారనీ. మేము ఎవరం దాన్ని లక్ష్యే పెట్టలేదు.

ఆ తర్వాత, రెండు రోజులకి ఈ కథకి నాయకుడైన విశ్వంతో పరిచయం అయింది నాకు. అతడు ఈ హైస్కూల్లో టీచర్లుగా ఎన్నికైన వారిలో ఒకడు. నాయకుడు ఎలా అయాడు అనేది చిక్కు ప్రశ్న. నాయకి తనకు తానుగా వరించిన వ్యక్తి నాయకుడు అవుతాడని మనం అంగీకరించే పక్షంలో అతను నాయకుడు అవుతాడు. కాని ప్రత్యేకించి విశ్వంలో నాయకుని లక్షణాలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని లేవు? అని ప్రశ్నించుకుంటే ఈ ప్రశ్న అంత త్వరగా తేలదు.

విశ్వం అందగాడు. ఆకర్షణీయమైన రూపం. అతని కళ్లల్లో కనపడే అమాయకత, స్నేహం నన్ను ఆకర్షించాయి. నన్ను నేను పరిచయం చేసు కున్నాను. విశ్వంలో ఎదుటి వారిని ఆకర్షించే శక్తి విపరీతంగా ఉంది. అతన్ని చూడగానే ఎందుకో అతను మన వాడన్న భావం కలుగుతుంది. అభిమానం, వాత్సల్యం కలుగుతాయి. ఆడవాళ్లకి ప్రత్యేకించి ఏమి భావాలు కలుగుతాయో నా కప్పట్లో తెలియ లేదు.

అయితే ఎవరూ మెచ్చని విషయం ఒకటి ఉంది అతనిలో. పిరికి తనానికి మారుపేరేదంటే విశ్వం అని తక్కున సమాధాన మిస్తారు మామిత్ర బృందంలో ఎవరైనా సరే. విశ్వం పిరికి తనానికి అనేక రకమైన కథలున్నాయి. అందులో చాలా వరకు నిజమైనవి. మరికొన్ని అతన్ని రెచ్చగొట్టి ధైర్యంగా చెయ్యడానికి మా మిత్ర బృందం కల్పించి నవి. అయితే విశ్వం రెచ్చిపోలేదు. ఆ కథలని ఖండిం చనూ లేదు. పైగా అవన్నీ నిజమని ఒప్పుకునే వాడు కూడా. విశ్వం పిరికి తనానికి తోడు నిర్లిప్తత. ఒంటరితనంలో ఆనందం అతనిలో కన్పించేవి. వీటిని పోగొట్టడానికి నేనూ అతనితోటి ఉపాధ్యా యులూ చేసిన ప్రయత్నాలేమీ ఫలించలేదు.

అతనివి నిస్సహాయిత కన్పించే కళ్లు. ధైర్యం చేసి నిర్ణయం తీసుకోలేని అతని అసమర్థత మాకు చిరాకు కల్గించేది. చిన్నప్పుడు క్లాసులో తనకి తెలియని విషయాన్ని గురించి మాస్టరుని ప్రశ్నించటం దగ్గర నుంచి, ఈ నాడు తనకు వివాహ ప్రయత్నాలు చేస్తున్న తల్లిదండ్రుల్ని వారించటం దాకా కూడా అతని అసమర్థత కనిపిస్తుంది. ప్రతి చిన్న విషయములోను ఇతరుల సలహా, సహాయము మీద ఆధారపడేవి విశ్వాన్ని ఎలా ఉత్తేజితుణ్ణి చేసి, మనుష్యులలో పడవేయాలో మాకు బోధ పడేది కాదు. మేము అతన్ని గురించి ఇంత పట్టించు కోవటానికి కారణం అతని మీద మాకు గల అపార మైన ప్రేమ, వాత్సల్యం.

అయితే ఏ విషయానికైనా మార్పు ఉంటుం దని, అది నమ్మలేనంత అద్భుతంగా ఉంటుందని మేము ఊహించలేదు. ఆ మార్పు విశ్వంలోనూ కనిపించింది. విశ్వం ఒకానొక విషయంలో— తన జీవిత సమస్యలో— ధైర్యం చేశాడు. అది అతను గాని, మేముగాని ఊహించలేని సంఘటన— అతను ప్రేమలేఖ వ్రాయటం! కూడా తోడులేనిదే సినిమాకి కూడ వెళ్లలేని విశ్వం ఇంత ధైర్యం చేశాడంటే నమ్మలేక పోయాను. ఏమయితేనేం, అది అతని జీవితాన్ని మార్చివేసింది. అది అతని జీవితాన్ని ఎలా మార్చిందో చెప్పేముందు అతన్ని గురించి మరికొంత చెప్పాలి.

అదృష్టం ముందు పుట్టి తర్వాత విశ్వం పుట్టాడు. అతనికి కావాల్సినవన్నీ అతను అడగ కుండానే, ప్రయత్నించకుండానే అతనికి లభ్య మవుతూ ఉంటాయి. కోరి! వలచి వస్తూంటాయి. అతను దేనికోసమూ కష్టపడేవాడు కాదు. అతని బస కోసం ప్రయత్నించింది నేను. కాళ్లరిగేలా తిరిగి వాకబు చేసినా కాస్తమంచి వసతి ఎక్కడా దొరకలేదు. దొరికినవి అలగాజనానికి పనికి వచ్చేవి కాని విశ్వంలాంటి వాడికి కాదు. ఇలాంటి పరిస్థితిలో కరణంగారు అతన్ని సాదరంగా ఆహ్వానించి తన ఇంట్లోనే ఉండమని అడిగారు. ఇందుకు విశ్వం అదృష్టం, కరణంగారి సహృదయత తప్ప మరే కారణాలు లేవు. విశ్వం వాళ్లింట్లోకి జేరాడు.

కరణంగారింట్లో అతనికి చక్కటి ఆదరణ లభించింది. ప్రొద్దున్నే కాఫీ ఫలహారాలు, తర్వాత స్నానానికి ఏర్పాట్లు ఇంకా మిగిలిన ఏర్పాట్లు అన్నీ సవ్యంగా జరుగుతాయి. అతని గది తీర్చి దిద్దబడి ఉంటుంది. అతను నిద్రలేవక ముందే గది ఎవరో ఊడిచేస్తారు. లేచేటప్పటికి మొహం కడుక్కోవటానికి నీళ్లు సిద్ధంగా ఉంటాయి. ఇల్లాగే అన్ని ఏర్పాట్లూ అతనికి తెలియకుండానే జరుగుతాయి. వీటన్నిటిలోనూ ముఖ్య పాత్ర నిర్వహించే వ్యక్తి కరుణ అని నాకు తర్వాత తెలిసింది.

కె. సూర్యనారాయణమూర్తి
రామచంద్రరావు

విశ్వం చేతలలో సమర్థుడు కాడుగాని మాటలు అనర్గళంగా మాట్లాడగలడు. విషయం కొత్తది కాకపోయినా తిరిగి తిరిగి వినాలనిపించేలా చెప్పే అతని వాక్చాతుర్యం నన్ను విపరీతంగా ఆకర్షించింది.

విశ్వం కరణం గారింట్లో ఉండటం వలన వారింటికి నా రాక పోకలు చాలా పెరిగాయి. తీరికగా ఉన్నప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళేవాడిని. ఉంటే విశ్వంతోను, లేకపోతే కరణంగారితోను,కరుణతోను మాట్లాడుతూ కూర్చొనే వాడిని. ఏమిటో గాని ఆ ఇంట్లో ఉన్న వాళ్ళంతా నాకు అతి సన్నిహితులే.

విశ్వం పట్నం విశేషాల గురించి చాలా చెప్పేవాడు. అక్కడి రాజకీయాలూ, వింతలూ, విశేషాలూ చెప్పేవాడు. అన్ని రంగాలతోనూ కాస్తో కూస్తో పరిచయం ఉన్నవాడిని కావటం మూలాన ఎవరు దేని గురించి మాట్లాడినా ఉత్సాహంగా పాల్గొనే వాడిని. ప్రత్యేకించి విశ్వం ఏ విషయం చెప్పినా చాలా ఉత్సాహకరంగా చెప్పేవాడు.

ఒక నాడు అతడు తన తల్లిదండ్రుల్ని గురించి నాకు చెప్పాడు. ఆ రోజు డైరీలో బంగారు అక్షరాలతో రాసుకోవలసిన రోజు అని నా కప్పట్లో తెలీదు.

విశ్వంతో నా పరిచయం వృద్ధి అయిన కొద్దీ అతనిపై నా ప్రేమ అధికం కాసాగింది. అతన్ని విడివి ఉండలేనంత సన్నిహితత్వం ఏర్పడింది. అతనికి ముల్లు గుచ్చుకుంటే నాకు బాధకలిగే పరిస్థితి వచ్చింది.

అయితే నన్నేకాకుండా మరో వ్యక్తిని కూడా నాకంటే గాఢంగా ఆకర్షించాడన్న సంగతి జర్పెల్ల తర్వాత గాని నాకు తెలియలేదు. బహుశా అతనికే తెలిసిఉండదు. ఆకర్షించ బడ్డ వ్యక్తి మా సంభాషణ తలుపు చాటు నుంచి విని పరవశమయ్యే కరుణ. విశ్వం విషయంలో కరుణ చూపిస్తున్న ఉత్సాహం, అతన్ని ఆమె ప్రేమిస్తున్నంద విషయాన్ని పూర్తిగా నిరూపిస్తోంది. ఆ విషయం

ప్రేమ లేఖ

ఆమెని స్పష్టంగా కనుక్కోవాలనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చాను.

*   *   *

ఆ రోజు ఆదివారం. నేను కరణంగారింటికి వెళ్ళేటప్పటికి ఇల్లంతా బోసి పోయినట్లుంది. విశ్వం వూళ్ళో లేడు. వాళ్ల వూరు వెళ్ళాడట. కరణంగారు ఇంట్లో లేరు. ఇల్లంతా లేడి పిల్లలా గంతులేసే కరుణ ఒక చోట నిర్లిప్తంగా కూర్చుని ఉంది. మనిషిలో ఉత్సాహం లేదు. చాలా దిగులుగా ఉంది. పలకరించినా ఉత్సాహంగా మాట్లాడలేదు. ఆమె మనస్సు ఎటో ఉంది.

'ఏమిటమ్మా అలా ఉన్నావు ?' అన్నాను.

'ఎలా ఉన్నాను ?' అంది తలవంచుకునే.

'ఒంట్లో బాగాలేదా' అని అడిగాను.

'బాగానే ఉంది'

నాకు కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు తెచ్చిన పని మనిషి చెప్పింది అమ్మాయి గారికి సంబంధం చూశారని.

నేను గతుక్కుమన్నా పైకి నా ఆరాటం తెలియనియ్యలేదు.

'శుభం. ఏవూరేమిటి ?' అన్నాను ఆశీర్వదిస్తున్నట్లు చెయ్యెత్తి.

హఠాత్తుగా తలయెత్తి చూసింది. ఆ కళ్లల్లో నీళ్లున్నాయి.

'నీకు కూడా వేళాకోళంగా ఉందా?' అంది.

'ఇందులో వేళాకోళం ఏముందమ్మా. అన లేవూరో చెప్పావు కాదు' అన్నాను.

కరుణ బాధగా తలదించుకుంది.

'మా బావంటే నా కిష్టం లేదని నీకు తెలుసు. అసలొక ఆడదాన్నంటూ పెళ్లి చేసుకునే అర్హత అతనికి లేదన్న సంగతి కూడా నీకు తెలుసు. తెలిసి, నేను విచారంలో ఉంటే వోదార్చ వలసిన నువ్వే ఇలా మాట్లాడతావా ? అంది.

నాకు అప్రయత్నంగా ఆమె భావవ్యక్తిత్వం మనోఫలకంలో మెరిసింది. నెల రోజుల క్రిందట అతను ఇక్కడికి వచ్చినప్పుడు చూశాను. ఉలూ కాని కుండేగుడ్లు, కాకిగూడులాంటి జుట్టు, సౌష్టవం లేని ఆకారం అతని బాహ్య రూపంలో కొట్టొచ్చినట్లు కనబడే లక్షణాలు, విపరీతమైన అహంకారం, నిర్లక్ష్యం, పెద్దలపట్ల అగౌరవం, సాటివారి యడ ఈర్ష్య, అసూయ, సంస్కార విహీనమైన ప్రవర్తన— ఇవి అతని అంతర్గత రూపపు లక్షణాలు. అవలక్షణాలన్నీ పోగు చేసి ఒక రూపాన్నూహించుకుంటే ఆ రూపపు దరిదాపుల్లో కరుణ బావ ప్రభాకరాన్ని వూహించుకోవచ్చు. వెనక ఆస్తిలేక పోతే అతను ఎక్కడా చెల్లుబాటు కాడు.

'మీ నాన్నకి చెప్పావా ఇష్టం లేదని ?' అని అడిగాను.

'చెప్పాను. కాని మా నాన్న వినే స్థితిలో లేరు. ఆయనకి వాళ్ల చెల్లెలు అంటే అభిమానం. నేను పుట్టినప్పుడే మాట పుచ్చుకుందట అత్తయ్య. ఈ మధ్య సంవత్సరం క్రితం మరొకసారి అడిగారట. నాన్నగారు మాటిచ్చారు. ఆడిన మాట తప్పరు ఆయన. 'ప్రాణంకన్నా మాట విలువ ఎక్కువ అంటారు.'

'పోనీ నేను చెప్పి చూడనా ?'

'కష్టం. నీ మాట విలువ తగ్గిపోవడం తప్ప ప్రయోజనం ఉండదు. నా మీద ప్రేమకొద్దీ ఏదైనా లాభం ఉండవచ్చునన్న ఆశతో నీ మాట విలువ త్యాగం చెయ్య దలుచుకుంటే తప్పకుండా అడుగు. కాని ఫలితం ఉంటుందనుకోను' అంది.

'సరేలే తర్వాత చూద్దాం. నాన్న ఎక్కడికి వెళ్లారు ?'

'వూళ్ళోకి వెళ్లారు. పురోహితుని దగ్గరకి కావచ్చు'

లేచి వెళ్లిపోబోతూ ఆగాను.

'ఒక్క మాట అడుగుతాను ఏమీ అనుకోవు కదూ' అన్నాను

ఆమె తలెత్తి చూసింది. నా మోహం మీద చిరునవ్వు చూసి నా భావం గ్రహించి సిగ్గుపడింది. 'నిజమేనా' అని అడిగాను.

'ఏమిటి ?' అంది తలవంచుకునే.

'విశ్వం అంటే నీకు. . . .'

చిన్న చిరునవ్వు నవ్వి తలదించుకుంది.

'సరే విశ్వం వచ్చాక అతనితో మాట్లాడతాను' అన్నాను వచ్చేస్తూ.

*   *   *

విశ్వం వచ్చాడని తెలిసాక అతని రూముకి వెళ్ళాను. అప్పుడు డైరీ రాస్తున్నాడు. నన్ను చూసి 'కూర్చో' అన్నాడు. 'నువ్వు రాసుకో. తర్వాత కలుస్తాలే' అన్నాను. 'ఫరవాలేదు. తరవాత రాసుకుంటాను ఉండమ'ని బలవంత పెట్టాడు.

'నేనెందుకు? ఏ సుందరి గురించి రాసుకుంటున్నావో' అన్నాను సరదాగా అంటున్నట్టు.

విశ్వం నవ్వలేదు. 'నీకు తెలుసు' అన్నాడు.

'నాకేం తెలుసు'

'మనిద్దరి మధ్య రహస్యాలు అనవసరం. సాఫీగా మాట్లాడుకుందాం.' అన్నాడు.



'కరుణ గురించి నీ ఉద్దేశం ఏమిటి?' అన్నాను.

విశ్వం కొంతసేపు మాట్లాడలేదు. తర్వాత తను రాస్తున్న డైరీ నాకిచ్చి చూడమన్నాడు. అది చూశాక విశ్వానికి కరుణపై ఎంత అనురాగం ఉందో తెలిసింది నాకు. ప్రాణంగా ప్రేమిస్తున్నాడు ఆమెని. ఆమె లేనిది అతనికి జీవితం లేదు. ఆమె అంగీకరించక పోతే అతనికి ఆత్మహత్యే శరణ్యం.

విశ్వానికి కరుణ అవసరం చాలా మటుకు కనిపించింది నాకు. విశ్వం విశ్వంగా బతకలేడు. కరుణ అతన్ని కనిపెట్టుకుని ఉండగలదు. అతని అవసరాలు తీర్చగలదు. విశ్వం తన అవసరాలు చూసుకోలేనివాడు. కరుణ లేనిదే అతనికి రోజు గడవటం అసాధ్యం.

అతనికి ఒక్కటే లోటు. ధైర్యం సాహసం లేకపోవటం. సరిగ్గా అవే కరుణ ఎక్కువ పాళ్ళల్లో భర్తీ చెయ్యగలదు. కరుణతో కలిస్తేనే విశ్వం

34 వ పేజీ చూడండి

బిన్‌టెక్స్

చేనేత బట్టలు. అనేక డిజైనులలో రంగులలో నమూనాలలో లభిస్తాయి

బిన్‌టెక్స్ చేనేతబట్టలు నమ్మకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే విశిష్టమై కసగూడా దిగని రంగు వేయబడ్డ నూలుతో బిన్నీవారు తమ నిర్ణయాలకు అనుగుణంగా తయారయేటట్టు చూస్తారు.

బిన్‌టెక్స్ చేనేత బట్టలను, అనుమతితో ఈ సైను బోర్డును ప్రదర్శించే బిన్నీ మిల్ స్టాకిస్టులవద్ద కొనండి.

BINNY'S FABRICS
BINNY & CO. LIMITED, MADRAS

బిన్నీ & కంపెనీ, లిమిటెడ్ మద్రాసు

మందరమైన రంగైన మధుర చీరలు



అందాలు చిందే కోయంబత్తూరు చీరలు

JWT/BY/BX-2722

క్లియరెన్స్ అమ్మకం

ఆకర్షణీయమైన రంగులలో మిక్కిలి అందమైన నవీన డిజైనులలో చేనేత చీరలు. ఒక్కొక్కటి ధర రు. 7/50. 2 చీరలు రు. 14. 3 చీరలు రు. 20. డీలక్సురకం ఒక చీర రు. 11. 2 చీరలు రు. 21. 3 చీరలు రు. 30. స్పెషల్ రకం చీరలు 1కి రు. 15. 2 చీరలు రు. 28/-. 3 చీరలు రు. 39/-. అన్నిటికిపోస్టేజి ప్యాకింగు ఉచితం. 2 చీరలు కొనువారికి ఒక జత ఇయర్ టాప్స్, 3 చీరలు కొనువారికి ఒక బ్లవ్స్, ఒక జత ఇయర్ టాప్స్, ఉచితముగా పంపబడును. కొద్ది స్టాకుగలదు. మీ ఆర్డరుము వెంటనే పంపండి. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

THE ROYAL STORES (APM2)
Post Box No. 1774. Delhi 6.

తామరకు లిచెన్సా

సుప్రసిద్ధమైన
జర్మన్ నివారిణి
ప్రతిచోటా డాక్టర్లు
సిఫారసు చేస్తారు.
ఈ క్రిందివాటికి నివారణకరమైనది
అమోఘము అగు శీఘ్రనివారిణి

- పుళ్లు
- కాలివ్రేళ్ల మధ్యపాసిన పుండ్లు
- మడమపగుళ్లు
- చాకలి గజ్జి
- మొటిమలు ఇంక ఇతర చర్మరోగములు

అసలు జర్మన్ సూత్రాన్ని అనుసరించి
ఇండియాలో వీరిచే తయారు చేయబడును

ది డాలర్ కంపెనీ

337, తంబుచెట్టి స్ట్రీటు, మద్రాసు-1
పెద్ద కెమిస్టుల అందరివద్ద లభించగలదు

(3DOL-1 TG)

ప్రేమ లేఖ

15 వ పేజీ తరువాయి

ఒక పూర్తి వ్యక్తిగా తయారవుతాడు. కరుణతో అతనికి వివాహం అయితే తప్ప, అతను విలువలేని నిస్సారమైన జీవితం గడిపే ప్రమాదం ఉంది. ఇంకో అమ్మాయిని చేసుకున్నా ఆమె కరుణ లాంటిది అయి ఉంటుందనీ, అతన్ని అర్థం చేసుకో గలుగుతుందనీ, ప్రత్యేకించి అతని హృదయాన్ని ఆకట్టుకో గలుగుతోందనీ నిశ్చయంగా చెప్పుకో లేము గదా.

విశ్వానికి కరుణపై అనురాగం ఉందని బుజువు అయ్యాక 'ఈ విషయాన్ని కరణం గారితో సంప్రదిస్తా' నన్నాను విశ్వం ఉలిక్కి పడ్డాడు, ఏదో ప్రమాద వార్త విన్నట్లుగా మీ దర్బిదంద్రుల ద్వారా అడిగిస్తాను. ఎడ్రసు ఇవ్వమని అడిగితే మరింత భయపడ్డాడు. వద్దన్నాడు. తనని బయట పడెయ్యవద్దన్నాడు. కరణం అంటే తనకి ఇష్టమే కాని తను చొరవ తీసుకుంటే అమ్మా నాన్నా అపార్థం చేసుకోవచ్చునన్నాడు. కాలమే సమస్యల్ని పరిష్కరిస్తుందన్నాడు. అతని పిరికి తనానికి అతన్ని పూర్తిగా మందలించి, ఇంటికి వెళ్లిపోయాను.

తర్వాత కరుణ సంగతి ఆలోచించాను. ఆమెని తండ్రి ప్రభాకరానికైనా చేస్తాడు. ఆమె కాదంటే మరెవరికైనా చేస్తాడు. 'మరెవరికైనా' అన్న పదం కింద వచ్చే వేలాది మందిలో విశ్వం ఉన్నాడో లేడో నిశ్చయంగా తెలియదు. ఆయన అంతస్తుకి ప్రాధాన్యత ఇచ్చే పక్షంలో విశ్వానికి ఏ మాత్రం అవకాశం లేదు.

ప్రభాకరాన్ని చేసుకోవటం కరుణకి ఇష్టం లేదు. అతన్ని చేసుకుంటే నరక యాతనే అని ఆమెకి తెలుసు. అతనికే తండ్రి నిశ్చయం చేస్తే ఆమె ఏ అఘాయిత్యానికైనా పూనుకునే అవకాశం ఉంది. అది కాక మరే సంబంధమైనా చేస్తే ఆమె తండ్రి మాటను శిరసావహించవచ్చు.

కేవలం కరుణ వేపునించి ఆలోచిస్తే, ఆమె సుఖంగా ఆనందంగా జీవితం గడపాలంటే ఆమె విశ్వాన్ని చేసుకోవాలి. చేసుకోక పోతే ప్రభాకరాన్ని చేసుకోవాల్సి వస్తుంది. అది నరక సదృశం. ప్రభాకరాన్ని కాక మరెవర్ని చేసుకున్నా కూడా ఆమె సుఖ పడుతూందని నిశ్చయంగా చెప్పలేము. ఆభర్త విశ్వంలా ఆమెని ఆకర్షించగలడని, ఆమె హృదయంలో చోటు చేసుకోగలడని నమ్మకం ఏముంది?

కాబట్టి ఇప్పుడే ప్రయత్నం చెయ్యాలి. ఏదీ చెయ్యకపోతే ఆమెకి ప్రభాకరంతో పెళ్లవుతుంది. ఎలాగైనా ఆమెకి విశ్వంతో వివాహం జరిపించటానికి నా శాయశక్తులా కృషి చెయ్యాలి. నా జీవితంలో నేను ఒక మంచి పని అంటూ చెయ్యగలిగితే ఇదే అవుతుంది. నేను ఈ విషయంలో బాబాయితో గట్టిగా మాట్లాడ దలచుకున్నాను. కరుణ చెప్పినట్లు బాబాయి దగ్గర నా మాట విలువ పోయినా నేను లెక్క చెయ్యను.

నాకైతే నమ్మకం లేదు ఈ వివాహం జరుగుతుందని. అయినా శాయశక్తులా ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను.

అనుకోకుండా నేను ఆ సాయంత్రం ప్రయాణం కట్టవలసి వచ్చింది. నాకు బాగా తెలిసిన వాళ్ళకి ప్రాణం. మీదికి వచ్చిందని టెలిగ్రాం వచ్చింది. పదిహేను రోజుల తర్వాతగాని తిరిగి రాలేక పోయాను. వచ్చాక నాకు పరిస్థితి అయోమయంగా కనిపించింది. విశ్వం కరుణకి ప్రేమలేఖ వ్రాయటం, అది కరణం గారి దృష్టిలో పడటం, ఆయన అగ్గి మీద గుగ్గిలం కావటం, అతన్ని స్కూల్లోంచి ఊళ్లోంచీ దౌర్జన్యంగా బహిష్కరించటం జరిగి పోయాయి. నాకేమీ అర్థం కాలేదు. ఎందుకు జరిగిందో, అసలేం జరిగిందో స్పష్టంగా తెలియాలంటే బాబాయినే కలుసుకోవాలని వెంటనే పై మీది కండువా వేసుకుని బయలు దేరాను.

ఇంటికి వెళ్లేసరికి ఆయన మండి పడిపోతున్నాడు. నన్ను చూడగానే 'చూశావా? సూర్యం! ఏం జరిగిందో' అన్నారు.

'ఏం జరిగింది.' అన్నాను.

'ఎంత జరగాలో అంత జరిగింది. కృతఘ్నుడు. విశ్వాసం లేదు. ఇంట్లో చోటు ఇస్తే ఇదేనావీడు చేసేది ?' అన్నాడు కోపంగా.

'విశ్వం సంగతా ?' అన్నాను.

'ఆ ! వాడి సంగతే : ఇది చదువు తెలుస్తుంది' అంటూ బాగా నలిగి పోయిన ఒక ఉత్తరం చేతి కిచ్చాడు. కోపంకొద్దీ ఆయన నలిపేసి ఉంటాడని తెలుస్తూనే ఉంది.

అందులో ఇలా ఉంది :

'ప్రియమైన కరుణా !

నేనెన్నోసార్లు నిన్ను ఒంటరిగా కలుసుకుని మనకు సంబంధించిన ముఖ్యమైన విషయం ప్రస్తావిద్దామని చూశాను. కాని వీలుకాలేదు. ఇక ఈ ఉత్తరం ద్వారా తెలియపరుస్తున్నాను. నన్ను అర్థం చేసుకుంటావని ఆశిస్తాను. నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాననే విషయం ఈపాటికి నువ్వు గ్రహించి ఉండవచ్చు. నీకు నాపట్ల సదభిప్రాయం ఉందనీ నాతో వివాహానికి నువ్వు సుముఖురాలివనీ నా విశ్వాసం. అయితే ఈ వివాహానికి నీ బావ ఆటంకం ఉందని విన్నాను. నీ నాన్న గారు అటే మొగ్గుతున్నారని, అతనితో నీ వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయనీ తెలిసింది. నీ అభిప్రాయం నాకు తెలియదు. కాని డబ్బుని తప్ప మనుష్యులని ప్రేమించటం ఎరగని నీ బావతో నువ్వు సుఖపడతావని నేను అనుకోను. ఈ విషయంలో నీ జవాబు వ్రాస్తే ఏం చెయ్యాలో ఆలోచిద్దాము. నీ నాన్నతో సంప్రదించడం గాని— ఆయన ఒప్పుకోరని నీవు నిశ్చయంగా భావించే పక్షంలో మనిద్దరం కలిసి ఎక్కడికైనా వెళ్లి పోవటం గాని— ఏదో ఒకటి చేద్దాము. ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని మన జీవితాలు వ్యర్థం ఎందుకు చేసుకోవాలి ? మనిద్దరికీ అంగీకారమైన తర్వాత ఇతరుల అంగీకారం ప్రసక్తి దేనికి ? మన రెక్కల మీద మనం జీవించలేమా ? ఆలోచించు.

నీ జవాబు కోసం ఎదురు చూస్తుంటాను

ఇట్లు
నీ
విశ్వం.'

'చదివావా ?' అన్నాడు. అప్పటిదాకా నా ముఖంలోకి ఆత్రుతగా చూస్తున్న కరణంగారు.

'ఆ' అన్నాను నేను.

విశ్వం వ్రాసిన విషయాల కన్నా విశ్వం చేసిన ధైర్యమే నన్ను ఆశ్చర్య పరిచింది. 'నీ వివాహ విష

యాన్ని కదుపుతాను' అంటేనే 'నద్దు నద్దని' కంగారు పడిన విశ్వం ఈ ఉత్తరం ఏ ధైర్యంతో వ్రాసాడనేది నాకు అంతు పట్టలేదు. ప్రేమ బలీయం అంటారు. ఇందుకేనేమో. ప్రేమించినమనిషి ఎన్ని సాహసాలు చేస్తాడో చెప్పలేము. ఉత్తరం రాయడం ఒక లెక్కలోనిది కాదు.

'దాని విషయమే నాకు కంగారుగా ఉంది బాయనా! ఎంతయినా విషయం దాగదు. నాలుగు రోజుల్లో ఊరంతా గుప్పుమంటుంది. మేనల్లుడేమో పెంకివాడు. మొండిఘటం. దీన్ని కాదన్నా అనగలడు. తర్వాత దానికి పెళ్ళికాదు : ఆ వెధవ ఏదో చేసిపోయాడు. మేము అనుభవిస్తుండటానికి' అన్నాడు జరగబోయేదానికి భయం, విశ్వం మీది కోపం రెండూ ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఇప్పుడు విశ్వం తరఫున ఎలా మాట్లాడాలో నాకు తెలియలేదు. ఒకటి ఇది సమయం కాదు. ఆయన నిలువునా మండిపోతున్నప్పుడు, తన కూతురి భవిష్యత్తు గురించి శోకం, భయంతో నిండి పోయినప్పుడు ఒక వ్యవహారం మాట్లాడ కూడదు. ప్రత్యేకించి ఆయన కోపానికి పాత్రుడైన వ్యక్తి వివాహ విషయం, పైగా ఆయన కూతుర్ని ఇమ్మని అడగటం అసలు పనికి రాదు. ఇన్నింటికీ తోడు ప్రేమలేఖ వ్రాసి విశ్వం పరిస్థితుల్ని పాడు చేశాడు. భమిడిపాటి వారన్నట్లు 'అసలే కోతి. అందులో కల్లు తాగింది. ఆ పైన తేలు కుట్టింది. దరిమిలాన ఎలక్షన్‌కి అభ్యర్థిగా నిలిచింది' అన్నట్లు తయారయింది పరిస్థితి.

అయినా ధైర్యం చేశాను.

'అమ్మాయి అభిప్రాయం కనుక్కున్నారా?' అన్నాను.

ఆయన అనుమానంగా చూశారు 'అంటే ?' అన్నారు.

నీళ్ళు నమిలాను. 'విశ్వం అంటే ఆమె కెటువంటి అభిప్రాయం ఉందో తెలుసుకుంటే' అన్నాను తెగించి.

ఆయన తల తిప్పేసుకున్నారు.

"అక్కర్లేదు. అతనితో పెళ్లి ప్రసక్తి లేదు. అతని ఉనికి సైతం సహించలేము. కాళ్ళు కడిగి పిల్లనిమ్మంటావా? అసంభవం' అన్నారాయన. నచ్చ చెప్పటానికి శతవిధాలా ప్రయత్నించాను.

'రేపే వెడుతున్నాను మా బావగారింటికి' అన్నాడు.

'పోనీ ప్రభాకరం అంటే కరుణ కున్న అభిప్రాయం కనుక్కోండి ఆమె కిష్టం ఉన్నట్లు లేదు' అన్నాను.

'అవసరం లేదు. దాని ఇష్టా ఇష్టాలతో ప్రసక్తి లేదు. ఇదివరకే మాటిచ్చేశాను. నాకు మాట; వంశ ప్రతిష్ట ముఖ్యం' అన్నారాయన దృఢంగా.

వోడిపోతున్నానన్న భావం కలిగింది నాకు. ఈ విషయం తెగేదాకా లాగ దలుచుకున్నాను.

'విశ్వం స్వతహాగా పిరికి వాడు. అతను ఈ ఉత్తరం రాశాడంటే నమ్మకం కలగటం లేదు' అన్నాను.

'బుజావు కావాలా ?' అంటూ ఆయన పని మనిషిని కేకేశారు. పని మనిషి వచ్చి నిలబడింది.

'చెప్పవే...ఏం చేశావో ? అన్నారు ఆయన తిరిగి చూసి.

'బాబుగోరి గది వూడవటానికి ఎల్లానండి. ఆయన ఉత్తరం ఇచ్చి కరుణమ్మగారికి ఇచ్చి రమ్మన్నారండి. నానటువంటి పనులు సెయ్యనని సెప్పానండి. ఓ పదినోటు నా సేతిలో పెట్టి నువ్వే సెయ్యాలని బతిమాలారండి. డబ్బు కాశపడి అది తీసుకుని తీసుకెళ్తు ఉంటే పెదబాబుగోరు సూశారండి. బయమేసి దాచేస్తు ఉంటే బెదిరించి లాక్కున్నారండి' అంది భయంగా.

'దీన్నిప్పుడే పనిలోంచి తీసేస్తానన్నాను. కరుణ వద్దంది. ఇరవయ్యేళ్లనించీ నమ్మకంగా ఉంటోంది. ఇనాళేదో తెలియక పొరపాటు చేసింది. అని నర్ది చెప్పింది. కరుణ మాట కాదనలేక ఉండనిచ్చాను. అన్నాడు. దానికేసి చూసి 'నువ్వు ఇంట్లోకి పోయి పని చూసుకో' అన్నాడు.

నేను కూడా ఇంటికి వచ్చేశాను.

*　　*　　*

చకచక నడుస్తున్నాను. విశ్వం ఇంకా వూరు వదలి ఉండడు పట్నానికి వెళ్లే రైళ్ళు అంత తరచుగా లేవు. అతనింకా స్టేషన్‌లోనే ఉండి ఉంటాడు. వెళ్ళి కలుసుకోవాలి.

స్టేషన్‌లో ఇంకా కాసేపట్లో కదలబోతున్న రైల్లో కనిపించాడు విశ్వం.

'సంగతి విన్నావా ?' అన్నాడు తల వంచుకుని.

'మొత్తానికి ధైర్యం చేశావు' అన్నాను ఏభావాన్నీ వ్యక్త పరచకుండా.

'నువ్వూ అది నేను రాశాననే అనుకుంటున్నావా?' అన్నాడు నేను మాట్లాడలేదు.

'నన్ను నమ్ము నూర్యం. అది నేను రాయలేదు.' అన్నాడు. అది అబద్ధం. స్పష్టంగా తెలిసి పోతోంది. నా దగ్గర ఒప్పుకోవటానికి సిగ్గు పడుతున్నాడు. ప్రేమలేఖ వ్రాయటం నేరం కాదు. ఇష్టం ఉన్న వాళ్ళు తమ మమతలని తెలుపుకునే ఉత్తరం అది. అది వ్రాయటం తప్పేమీ కాదు. రాశావని ఇతరులకి తెలియటం వలన మనకి కలిగే అగౌరవం ఏమీ లేదు. కాని విశ్వం జంకుతున్నాడు.

మామూలు పరిస్థితులలో అయితే విశ్వం నాతో నిజం చెప్పేవాడేమో. ఇప్పుడు ఇంత గొడవ జరిగాక ఒప్పుకోవడానికి సిగ్గు, భయం వేస్తున్నాయి' అతనికి ప్రేమలేఖ వ్రాసేటప్పుడు అతనికి ఒళ్ళు తెలిసి ఉండదు. అదిచ్చేశాక కంగారు పడిఉంటాడు. అది ఇంత గొడవ చేశాక తప్పించుకోవడానికి మార్గాంతరం లేక బుకాయిస్తున్నాడు.

ప్రేమ లేఖలో దస్తూరి అతనిది కాదన్న సంగతి అతన్నేవిధంగానూ బలపరచదు. దొంగతనంగా ప్రేమలేఖ రాసేవాడు— అందులోనూ విశ్వం వంటి పిరికి మనిషి— గుర్తు తెలిసేలా ఉత్తరం రాయడు. దస్తూరి మారుస్తాడు.

'నువ్వు కూడా నమ్మకపోతే నా ఖర్మ !' అన్నాడు విశ్వం

'నేను నమ్ముతున్నాను' అన్నాను అతన్ని వూరడించడానికి. రైలు కదిలింది.

*　　*　　*

తర్వాత తీరిగ్గా ఆలోచించాను.

నేరం చేశాడని పూర్తిగా బుజువు కాని వ్యక్తికి 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' ఇవ్వాలి. అతను నేరంచేసి ఉండకపోతే అన్న దృక్పథంతో ఆలోచించాలి. ఆ దృష్ట్యా ఆలోచిస్తే ఈ క్రింది విషయాలు చెప్పుకోవచ్చు.

ఒకటి విశ్వం నాతో అబద్ధం ఆడడు. ఎప్పుడూ మనసిచ్చి, అంతరంగిక విషయాలు సైతం మాట్లాడతాడు. రెండు, సహజంగా అతనికి 'ప్రేమలేఖ' రాసే ధైర్యం లేదు.

విశ్వం కాకపోతే మరెవడు ?

నాకు ఇద్దరి పేర్లు తోచాయి. ఒకడు ప్రభాకరం. రెండవ వాడు నాయుడు గారబ్బాయి.

విశ్వం అంటే కరుణ ఇష్టం చూపిస్తోందని ప్రభాకరం ఇక్కడికి వచ్చినప్పుడు తెలిసి ఉండాలి. ఆమె మీద కసికొద్దీ ఆమె జీవితం పాడుచెయ్యాలి అన్న సంకల్పంతో అతనే ఈ ఉత్తరం రాసి ఉండవచ్చు. పని మనిషికి ఉత్తరం ఇచ్చి కరణంగారికి దొరికి పొమ్మనీ బెదిరించినప్పుడు విశ్వం రాసిచ్చాడని చెప్పమనీ దానికి చెప్పి ఉండవచ్చు.

నాయుడుగారబ్బాయి. ఒకసారి కరుణ సిటీకి వెళ్ళినప్పుడు వెధవ్వేషాలు వేస్తే కరణంగారు



మొక్కలు విరగదొక్కించాలు. ఆ కోపం పెట్టుకుని అతను గాని, అతని తండ్రిగాని ఈ పని చేయించి ఉండవచ్చు.

వీరిద్దరూ కాక కరణంగారి శత్రువులెవరైనా ఈ పని చేసి ఉండవచ్చు. కరణం అన్న తర్వాత ఆయన ఎంత మంచి వాడైనా కొంత మంది శత్రువులు ఉంటారు.

విశ్వం రాయలేదనుకుంటే ఎవరు రాశారో అతనికి చూచాయగా తెలిసి ఉంటుంది. వూహించగలడు. మరెందుకు దాస్తున్నాడు ?

దీనికి సమాధానం తోచింది. రాసిన వాడు విశ్వానికి ప్రేమపాత్రుడయి ఉంటాడు.

వాయుడుగారబ్బాయితో విశ్వానికి చాలా స్నేహం ఉంది. ప్రాణస్నేహితులు కాదు గాని దాదాపు అంత స్నేహం ఉంది. ఊళ్లో ఉన్న అతని పరువు పోకుండా అతని నేరం తనపై వేసుకుని బయటి ఊరి వాడికి పొడటం సహజమే. పైగా విశ్వం తన పరువు ఎలాగా చెడింది కాబట్టి అతని పరువు రక్షిద్దామని అనుకుని ఉంటాడు. సహజంగా విశ్వంది ఉపకారం చేసే నైజం.

ప్రభాకరం మీద కూడా విశ్వానికి గౌరవం ఉంది. ఇంటి మేనల్లుడిగా, కరుణ బావగా అతనికి గౌరవం ఇస్తాడు. కరుణ విషయంలో తనకి పోటీ దారులనీ కరుణని తనకి కాకుండా చేస్తున్నాడనీ అతనిపై కోపం లేదు విశ్వానికి. పైగా ఇంటిగుట్టు రచ్చ కెక్కించటం అతనికి ఇష్టం లేదు. ఆ పరిస్థితిలో ఇంకెవ్వరైనా త్యాగం చెయ్యరేమో కాని విశ్వం చేశాడంటే నమ్మలేని విషయం మటుకు కాదు.

ఎవరు రాశారో స్పష్టంగా తెలియక పోయినా పరిస్థితి అర్థమయింది.

నాలుగు రోజులకి కథ చాలా ముందుకి నడిచింది. విశ్వం కరుణల సంగతి ఊరంతా గుప్పుమంది. కరణంగారు బెదిరి పోయారు. వూరంతా గుసగుసలు. వినపడేటప్పటికి ఆయనకి కంగారు పుట్టింది. మేనల్లుడి వివాహం త్వరగా జరిపిస్తే గాని వీలులేదు. ఎవరూ వూరుకోరు. పైగా ఈ వివాహం తప్పిపోతే కరుణకి పెళ్లికాదు అన్న కంగారుతో ఆయనకి గంగవెర్రులెత్తిపోతోంది. పల్లెటూరు అలాంటిది మరి.

వూరికి ప్రయాణం కట్టారు కరణంగారు. అయితే ఎంత త్వరగా వెళ్లారో అంత త్వరగానూ తిరిగి వచ్చేశారు. ఆయన కోరిక ఫలించలేదు. ఆయన బావగారు చెప్పిన విషయాలివి.

'నిప్పులేందే పొగరాదు. మీ అమ్మాయి విషయమంతా విన్నాం. పెళ్లిచేసుకోవడానికి మాకెంత మాత్రం ఇష్టం లేదు' అని.

అతడు ఉత్తరం రాస్తే అందులో కరుణ తప్పు ఏమి ఉందని అడిగారట కరణంగారు. ఆమె ప్రోత్సహించందే అతను ఒక అమ్మాయికి— అందులోనూ కరణంగారి కూతురికి— ఉత్తరం రాసి ఉండడని వాళ్లు అన్నారు.

ఆయన ఎంత ప్రతిమాలినా ఫలితం కనిపించలేదు. ఈ విషయాలన్నీ నాతో చెప్పుకున్నప్పుడు వూరడించడం తప్ప మరేమీ చెయ్యలేక పోయాను.

తిరిగి పట్నం పని మీద వెళ్లి ఒక రోజు ఉండి వచ్చాను భోజనం చేసి విశ్రమించానో లేదో పిడుగులాంటి వార్త తీసుకువచ్చాడు పాలేరు. విశ్వం వూళ్లోకి తిరిగి వచ్చాడని. నిర్ఘాంత పోయాను. ఎలా వచ్చాడో, ఇది సంభవమా ! అన్న విషయం, అంతకన్న జరిగిన పరాభవాన్ని విశ్వం ఇంత తేలికగా ఎలా మరచిపోయాడన్న విషయం నాకు అర్థం కాలేదు.

ఈ వూరు అతన్ని తిరిగి ఎలా సత్కరించిందో తలచు కోవడానికి కూడా భయం వేస్తోంది. విశ్వం ఎందుకు, ఎలా వచ్చినట్లు ? వీటికి సమాధానం రావాలంటే ముందు విశ్వాన్ని కలుసుకోవాలి. విశ్రాంతిని హాంఫుదా వేసి, తలుపువేసి బయటికి నడిచాను.

పరిగెత్తుకొచ్చి విశ్వం నన్ను కలిస్తే బాగుండుననిపించింది. కాని అటు వంటిదేమీ జరగలేదు. బస్సు దిగి వూళ్లోకి రావాలంటే కరణంగారింటి మీదుగా రావాలి. అతడు వూళ్లోకి వచ్చాడన్న సంగతి వూళ్లో ఏ ఒక్కరికి తెలిసినా అతడు బతికి బయట పడతాడన్నది సందేహమే. పైగా వచ్చేది కరణంగారి ఇంటి మీదుగా.

కరణం గారి ఇంటి ముందో, లోపలో ఏదో ఘర్షణ జరుగుతూ ఉండాలి. చకచకా నడుస్తున్నాను.

ఇంటి ముందు ఏమీ జరగటం లేదు. ఇంటి లోపల చూడాలి. సాధ్యమైనంత వేగంగా నడిచి కరణంగారింట్లోకి అడుగు పెట్టాను.

నా అంచనాలన్నీ తారుమారు చేస్తూ, నాకక్కడ కనిపించిన దృశ్యం నన్ను ఆశ్చర్య చకితుడిని చేసింది. నా కళ్లు నన్ను మోసం చెయ్యకుండా ఉంటే నేను చూసిన దృశ్యం ఇది విశ్వం, కరణంగారు, మరో ఇద్దరూ పెద్దమనుష్యులతో కుర్చీలలో కూర్చుని కాఫీలు త్రాగుతున్నారు.

'రా మార్యం లోపలకి' అన్నాక తేరుకున్నాను. కరుణ కాఫీ తెచ్చింది. ఆమె ముఖంలో ఆనందం స్పష్టంగా చూడగలిగాను. ఇది శుభప్రదమైన కార్యం గురించిన సమ్మేళన మనీ, ఘర్షణ కాదనీ అప్పటికి గాని నా మనసుకి ఎక్కలేదు.

'ఈయన జగన్నాథంగారు. నా ప్రాణస్నేహితులు. విశ్వం తండ్రి' అంటూ పరిచయం చేశారు ఒకాయినని. నేను నమస్కారం చేశాను. ఆయన ప్రతి నమస్కారం చేసి నా సమాచారం అడిగారు. చెప్పాను.

'తాంబూలాలు ఇచ్చేసుకున్నాం' అన్నారు కరణంగారు.

విశ్వం వైపు చూశాను. విశ్వం మందహాసం చేస్తున్నాడు. కాఫీ ఫలహారాలు అయాక 'అలా వూళ్లోకి వెళ్లివద్దాం రావోయ్' అన్నాడు విశ్వం.

అతనితో వెళ్లాలని ఉంది కాని ఈ మిస్టరీ పూర్తిగా విడాలంటే కరణంగారితోటే మాట్లాడాలి. 'నువ్వు నడుస్తూ ఉండు తర్వాత వస్తా'నని అతన్ని పంపేశాను. వంతెన దగ్గర ఉంటానంటూ వెళ్లిపోయాడు విశ్వం.

అంతా విశ్రమించాక కరణంగారు నన్ను లోపలికి తీసుకెళ్లారు.

"ఆశ్చర్యంగా ఉందా ? ! " అన్నారు.

"ఆశ్చర్యమా ? తల తిరిగిపోతేను ! " అన్నాను.

"నాకూ తల తిరిగి పోయింది. మా ప్రభాకరం కాదనగానే నిలువునా నీరయి పోయాను. వూరినిండా గుసగుసలు. నాకేమీ తోచలేదు. బయటికి పోలేక పోయాను. ఇంట్లో ఉండలేక పోతున్నాను. కూతురు ముఖం చూడలేక, నా ఖర్మకి విచారించలేక కూర్చుండి పోయాను. అసలా ఉత్తరం గురించి ఎందుకంత గొడవ చేశానా అనిపించింది. గుట్టు చప్పుడు కాకుండా అతన్ని పంపించేసి ఉంటే బాగుండేది అనిపించింది. ఇలా నన్ను నేను నిందించుకుంటూ ఇంట్లో కూర్చుంటే, నా కూతుర్ని గురించి ఆలోచించు కుంటుంటే నాకు దాదాపు పిచ్చిపట్టినట్లయింది.

నా నిస్సహాయత, విచారం విశ్వంపై కోపంగా మారాయి. నా కూతురు బ్రతుకుని నాశనం చేసిన వాడి బ్రతుకు నాశనం చేసి, వాళ్ల వూళ్లో వాడి ఘరపతి, గౌరవం బుగ్గిపాలు చేసి వాళ్ల తల్లిదండ్రుల్ని నడివీధిలో కడిగేసి నా కసి తీర్చుకోవాలనుకున్నాను. అతని ఎడ్రస్, ఆచూకీ కోసం అతని గదికి వెళ్లాను..............................

కరణంగారు ఒక్క క్షణం వూపిరి పీల్చుకుని మళ్లీ మొదలు పెట్టారు.

'...... తన కోపం తన శత్రువు అంటారు. ఒక్కొక్కప్పుడు మిత్రుడు కూడా అవుతుంది. ఆ కోపంలో అతని గదికి వెళ్లకపోతే ఇవాళ ఇంత సంతోషంగా కాఫీలు త్రాగుతూ పెళ్లి కబుర్లు మాట్లాడ గలిగేవాడిని కాదు. పిల్ల పెళ్లి నిశ్చయమైందన్న ధీమాతో ఉత్సాహంతో పరవళ్ళు తొక్కేవాడినీకాదు.

విశ్వం గదిలో నాకు అతని డైరీ కనిపించింది. కంగారుగా కాళీ చేసాడేమో అది మర్చిపోయాడు.

నిష్ఠుర నిజాలు!

కోడలిపై అత్తకెంత
కోపముండునో తెలుసా?
కోడలిపై ఎంత ప్రేమ
కొడుకు జూపునో అంత!
అన్న కీర్ష్య తమ్మునిపై
ఎన్నడు కలుగునో తెలుసా?
తనకన్నా ఎందునైన
తమ్ముడుపై కొచ్చినపుడు !
గురువుగారికి చిరాకెపుడు
కలుగుచుండునో తెలుసా?
శిష్యుని ప్రశ్నకు జవాబు
చెప్పశక్తి లేనప్పుడు !
ఆడదాని కష్టాలకు
అంత మెప్పుడో తెలుసా?
ఆర్థికముగా పురుషునిపై
ఆధారపడనక్కర లేనప్పుడు!

—రాచాబత్తుల వీరరాఘవాచార్య

...త్రంగా అతని తండ్రి పేరూ, ఎడ్రసు కోసం చూశాను............

" నేను ఏం చూశాననుకున్నావు ? జగన్నాథం గారి పేరు. ! ఆయన ఎడ్రసు ! ....

ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆయన కళ్లు జ్యోతుల్లా మెరుస్తున్నాయి. నాతో ఆయన

మంచి కారట్



బ్లేడులు తక్కువధర 4 న.పై మాత్రం

అన్నిచోట్ల దొరకును

ఓరియంటల్ కాస్మెటిక్సు ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసు

ajanta OC/64-3TG.

ప్రేమలేఖ

ఆశించినంత ఆనందం కనబడక పోయేసరికి ఆయన మళ్లీ ఇలా అన్నారు:

' జగన్నాథంగారి పేరు నీకు తెలీదు. తెలిస్తే ఆలా వుండవు. ఆ పేరు వింటే పువ్వులు పూస్తాయి. పైర్లు పెరుగుతాయి. పాపలు నవ్వుతారు. ఆయన నడిచిన చోటల్లా పచ్చగడ్డి మొలుస్తుంది. ఆయన ఉన్న చోట సుఖశాంతులు వర్ధిల్లుతాయి.

ఆయన నా ప్రాణం. నాభాగ్యదేవత. నాపాలిటి భగవంతుడు. నా జీవితాన్ని రక్షించినవాడు. నేను చేత కానిలేక మాపిన్ని ప్రసవానికి ముందు మందులు కొనలేక ఇంట్లో మొహం చూపలేక ప్రపంచం మీద విరక్తి పుట్టి చావలేక బ్రతకలేక పిచ్చివాడిలా తిరుగుతున్న రోజుల్లో ' నీ కెందుకు, నేనున్నాను ' అన్నవాడు జగన్నాథం. నాకండగా నిల్చి ఆశ్రయం ఇచ్చినవాడు. రెండేళ్లపాటు నా జీవితంలో అడుగడుగునా సాయపడుతూ నన్ను ఒక మనిషిగా నిలబెట్టినవాడు జగన్నాథం అంటే. ఆయన చలవ వల్లే నాకూతురు నాకు దక్కింది. మాపిన్ని గండం గడిచి బయట పడింది. అప్పటికి. ఆయన కరుణే నాకు నాకూతురిచ్చింది. ఆ పేరే పెట్టాను దానికి ' అన్నారు. కరణంగారు ఆవేశంగా.

" . . . . ఆరు సంవత్సరాలుగా మాకు వారి జాడ తెలియలేదు. నిన్న తెలిసింది. అదీ ఈ ఉత్తరం మూలంగా. డైరీ మూలంగా. ఏదో ముఖ్య విషయం చెప్పాలని కరుణ నాతో అంటున్నా వినిపించుకోక ఆమెను తీసికెళ్లి జగన్నాథంగారి కాళ్లమీద పడేశాను. ' నువ్వు బ్రదికించిన దాన్ని నీయింటే జేర్చుకో ' అన్నాను. ఆయన నవ్వాడు. ఎప్పుడూ అలాగే నవ్వుతాడు. ఆనవ్వు పాలరాతి కన్నా, తేట నీటికన్నా, పసన తొనకన్నా స్వచ్ఛంగా ఉంటుంది. ఆ నవ్వు విన్నవాళ్ల జీవితాలు ధన్యమవుతాయి .... '

" .... నాకు ముందు తెలియలేదు కాని అబ్బాయి కూడా చాలా మంచివాడు. చాలా వినయం కలవాడు. సంస్కారం ఉన్నవాడు. నే నతన్ని ఇంత అవమానించినా అతనికి వాస్తై కోపం లేదు. చాలా గౌరవించి మాట్లాడాడు. అలాంటివాళ్లు వేలమందిలో ఒకడుంటాడు. . . .

. . . . . ఇదంతా చేసినది ఆ ప్రేమలేఖ " అన్నారు.

నాకు నిజమే ననిపించింది. అది చాలా చాలా అద్భుతాలు చేసింది. దూరంగా ఉన్న స్నేహితుల్ని కలిపింది. ఇష్టంలేని పెళ్లిళ్లు తప్పించింది. మనసు కలిపిన వాళ్లను దగ్గిర చేసింది. పిల్లను చూసి కళ్లల్లో నిప్పులు పోసుకున్న వాళ్లని కుళ్లి కుళ్లి ఏడవమంది. ఇప్పటిదాకా జరిగిన, జరుగుతున్న సంఘటనలన్నీ ఆ ' ప్రేమలేఖ ' చుట్టూ చిత్రంగా పరిభ్రమిస్తున్నాయి. అది మామూలు ప్రేమలేఖకాదు. దుష్టులకి ఆశాభంగం కలగాలనీ, మంచి వారికి శుభకార్యాలు జరగాలనీ దేవుడు పంపిన ఆజ్ఞాపత్రం.

ఇది విశ్వమే రాసి ఉంటే అది అతడి అదృష్టం. అన్నా . కరుణలాంటి చక్కని చిన్నదాన్ని అతను పోగొట్టుకున్నాడు ఈ ఉత్తరం రాయడం మూలంగా. కీడు చెయ్యమని పంపిస్తే మేలు చేసింది. నా యుడు గారబ్బాయి రాసి ఉన్నా అంతే. వాళ్లనుకొన్న దొకటి జరిగిన దొకటి.

వెంటనే విశ్వాన్ని కలుసుకున్నాను. ఈ మాట కూడా విశ్వం అంగీకరించలేదు. ప్రేమలేఖ తన రాసినట్లు, ఇది వరకు తానన్న మాట మీద నిలబడలని అయి ఉండవచ్చు. లేకపోతే ' అదృష్టం బాగుంది కాబట్టి అంతా మంచి జరిగింది. మొత్తానికి నువ్వు చేసిన పని తప్పు ' అంటానన్న భయం కావచ్చు.

" ఇంకా బుకాయించడం దేనికి ? అంతా సవ్యంగా జరిగాయి కదా ! " అన్నాను.

"అన్ని విషయాలలోనూ నన్ను నమ్మేవాడివి. ఈ ఒక్క విషయంలోనూ ఎందుకు నమ్మటం లేదో నాకర్థం కావటం లేదు. నేను రాస్తే నాముఖ్య స్నేహితుడివైన నీతో చెప్పనా ? నీ దగ్గిర ఏదైనా దాచానా ?" అన్నాడు కళ్లల్లోకి చూస్తూ. అతను రాయలేదేమో ననిపించింది అప్పుడు. ఇంకా అనుమానం మిగిలి ఉన్నా అతను రాసి ఉండ దనే నిశ్చయించుకున్నాను.

' పోనీ రాసిన దెవరో నీకు తెలుసు ' అన్నాను.

' నాకా ? ' అన్నాడు ఆశ్చర్యంగా.

' అవును '

' ఎందుకనుకుంటున్నావు ? '

' తెలుసుకోవాలనే ఉత్సాహం నీకుంటుంది. '

' ఉంది. అయితే ? '

' నువ్వు దాస్తున్నావు. ఎవరు రాశారో నీకు తెలుసు. నేను ఇద్దరిని అనుమానిస్తున్నాను. వారిద్దరూ నీకు మిత్రులు. వారి పరువులు పోవటం ఇష్టం లేక నువ్వు దాస్తున్నావు. తెలుసుకోవాలనే ఉత్సాహం నాకు చాలా ఉంది. తప్పకుండా తెలుసుకుంటాను. నువ్వు ముందు చెప్పేస్తే మంచిది: నాకు శ్రమ తగ్గుతుంది !' అన్నాను.

"నువ్వు ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావు ! అన్నాడు విశ్వం. అతడు చెప్పడని నిశ్చయించేసుకుని సంభాషణ మార్చేశాను.

విశ్వం కరుణల వివాహం అతి వైభవంగా జరిగి పోయాక ఆరు నెలలు గడిచి పోయాయి. ప్రస్తుతం కరుణ, విశ్వం బెజవాడలో ఉంటూన్నారు.

ఉద్యోగ ప్రయత్నంలో నేను బెజవాడ ఇంటర్వ్యూకి వెళ్ళవలసి వచ్చింది. విశ్వం వాళ్లింట్లో దిగాను. చాలా కాలం తర్వాత కనిపించిన నన్ను విశ్వం దంపతులు సాదరంగా ఆహ్వానించారు.

' బాగున్నావా అన్నయ్యా. ఇన్నాళ్లకి కనిపించావు మన్న మాట ' అంది కరుణ.

ఇన్నాళ్లకి కూడా నాఅంత నేను రాలేదనీ, నా ఉద్యోగ ప్రయత్నం నన్నిక్కడికి తీసుకు వచ్చిందనీ చెప్పుకోవటానికి సిగ్గు వేసింది.

నేను విశ్వంలో చాలా మార్పు కనిపెట్టాను. పూర్వం నిర్లిప్తంగా, నిస్సహాయంగా కన్పించే ఆ కళ్లల్లో ఇప్పుడు ఉత్సాహం, ధైర్యం నిండుగా ఉన్నాయి. మనిషిలో గౌరవ, ధీమా అధికంగా కనిపిస్తున్నాయి. మేము ఇదివరకే హేళన చేసే పిరికితనం పాలు ఇప్పుడతనిలో ఏకోశానా లేదు. ఈ మార్పుకి కారణమైన కరుణని మనసులోనే అభినందించుకున్నాను. మా స్నేహితులంతా కలిసి చెయ్యలేని కార్యం కరుణ ఒక్కరే సాధించింది.

కన్ను ఆనంద సాగరంలో ముంచి వేసాయి. వారిని విడిచి వెళ్ళే రోజు వచ్చిందంటే నాకు చాలా బాధ అనిపించింది. వారి అన్యోన్యత, నాపట్ల ఆదరణ నన్నెంతగా బాధించి వేశాయి. కాని ఇంటర్వ్యూలో నెగ్గి, ఉద్యోగంలో జేరడానికి వెడుతున్న నాకు ఇక్కడ ఉండటానికి వీలులేదు.

ప్రొద్దున్న నిద్ర లేచేటప్పటికి ఆలుమగలు కాఫీలు సేవించి ఏదో పిచ్చాపాటి మాట్లాడు కుంటున్నారు.

'ఇవన్నీ నీకెలా తెలుసు' అంటున్నాడు విశ్వం.

'మీరు అన్నయ్యతో చెబుతోంటే విన్నాను' అంటోంది కరుణ. నా పేరు వినేసరికి నాకు బద్ధకం పూర్తిగా పోయింది. 'ఏమిటమ్మా నాకు చెప్పినది' అన్నాను.

'వారి చిన్ననాటి కబుర్లు : నాకెలా తెలిశాయి అని అడుగుతున్నారు ?' అంది.

'అతనంటే నీ ఆసక్తి అలాంటిది. నువు చాటుగా వినేదానివని నాకు ఎప్పుడో తెలుసు' అన్నాను.

'పో అన్నయ్యా' అంది కరుణ.

ఆ సాయంత్రమే ప్రయాణం కట్టాను.

'అప్పుడే బయలుదేరుతున్నావా ? ఇంక నాలుగు రోజులుండరాదా !' అంది కరుణ.

'ఇంకో నాలుగు రోజులుంటే ఈ ఉద్యోగానికి నీళ్ళు వదులుకొని ఇక్కడే ఉండిపోవలసి వస్తుంది. అప్పుడు నాలుగు రోజులు కాదు. మళ్ళీ ఉద్యోగం దొరికే దాకా'' అన్నాను నవ్వి.

ఇంతట్లోకే విశ్వం ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు. రిక్షాలో ఒళ్లంతా దుమ్ము కొట్టుకుని ఉంది. కూడా వచ్చిన వాళ్ళు వెళ్లిపోయారు. నేను ఆశ్చర్య పడి తేరుకునేలోగా కరుణలోపలికి వెళ్లి బట్టలు తేవడం, అతడు బట్టలు మార్చుకోవటం జరిగి పోయాయి.

''చూశావా సూర్యం. నన్నేదో పిరికి వాడనేవారు కదూ. ఇవాళ చూడు ఎంత ఘనకార్యం చేశానో'' అన్నాడు.

ఏమిటని అడిగాను.

'ఏమీ లేదు. నేను ఆఫీసునుంచి వస్తున్నాను. అటువేపు నుంచి ఒక లారీ స్పీడుగా వస్తోంది. రోడ్డుకి అడ్డంగా ఎనిమిదేళ్ల కుర్రవాడు నడుస్తున్నాడు. హఠాత్తుగా లారీని చూసి, ఎటు పోవాలో తోచక కంగారు పడి అక్కడే కూలబడ్డాడు. లారీ దగ్గరకి వచ్చేస్తోంది. జనం ప్రాణాలుగ్గ బట్టుకుని చూస్తున్నారు. నేనేం చేశానో నాకు తెలియదు. మరుక్షణంలో నేనూ ఆ పిల్లడూ రోడ్డు పక్కన దుమ్ములో ఉన్నాం. లారీ పక్కనించి దూసుకు పోతుంది' అన్నాడు విశ్వం.

ఆశ్చర్యంతో నేనేమీ మాట్లాడలేక పోయాను. కరుణ భర్తవంక ఆప్యాయంగా చూస్తోంది.

'ఏమిటోయ్. ఏదో నన్ను అభినందిస్తావనుకుంటే మాట్లాడకుండా కూర్చున్నావు. నే చేసిన పని సాహసంలా కనపడలేదా ?' అన్నాడు నవ్వుతూ.

'సాహసమే. కాదనను. ఇది ఇప్పటి విషయం. ఈ రోజుల్లో విశ్వంగా నువ్వు కుర్రాణ్ణి లారీ ప్రమాదం నుంచి తప్పించటమే కాదు, ఒంటరిగా అడవిలో పులితో దెబ్బలాడావన్నా ఆశ్చర్యపడను. చాలా రెట్లు ఎక్కువ' అన్నాను.

'నేనా ? సాహసమా ?' అన్నాడు తెల్లబోయి.

'అదే ఆ నాడు నువ్వు చేసిన పని. ప్రేమలేఖ వ్రాయటం' అన్నాను.

విశ్వం మొదట తెల్లబోయిన మాట వాస్తవం కాని అంతలోనే అతని ముఖకవళికలు మారి పోయాయి.

'నేనా ? నేను రాయలేదు' అన్నాడు. తర్వాత నాకే బాధ అనిపించింది. అతడు ఏదో నేరం చేసి నట్లు ప్రతీసారీ అడగటం అతడు కాదని మొత్తుకోవటం — స్నేహితుల మధ్య ఉండవలసిన అనుబంధం కాదిది.

కాని అతను ఇప్పుడు కూడా ఏదో దాస్తున్నట్లు అనుమానం కలిగింది నాకు. ఆ నాటి ప్రేమలేఖ గురించి మాట్లాడుతోంటే విశ్వానికి కాపాడ వలసిన అవసరం అతనికిప్పుడు లేదు. అతడు రహస్యం బట్ట బయలు చేసినా వారికిప్పుడేమీ ఆపద రాదు. ఆ వేడి చల్లారి పోయింది. పైగా వాళ్లిద్దరూ ఇప్పుడిక్కడ లేరు. ఒకడు హైదరాబాదులో, ఒకడు మదరాసులో.

ఎవరేమీ మాట్లాడే పరిస్థితిలో లేము. కరుణ సంభాషణ చాకచక్యంగా మార్చేసింది, పరిస్థితి కనిపెట్టి.

'అన్నయ్య ఇప్పుడే వెళ్లిపోతానంటున్నాడు' అంది.

'అదేమిటి మరి నాలుగు రోజులుండి పోవచ్చుగా' అన్నాను. కొంచెం వూపిరి పీల్చుకుని.

'లేదు విశ్వం. ముందు ఇంటికెళ్ళి నా ఉద్యోగం వార్త ఇంట్లో చెప్పి విశాఖపట్నంలో జాయిన్ కావాలి. టైము లేదు' అన్నాను.

పరిస్థితి తెలుసు కనుక విశ్వం అభ్యంతర పెట్ట లేదు.

* * *

విశ్వం స్టేషనుదాకా వచ్చాడు.

విశ్వాన్ని అనుమానిస్తున్నట్లుగా ప్రవర్తిస్తున్న అతన్ని క్షమాపణ కోరవలసిన అవసరం నా కన్పించింది.

'చూడు విశ్వం. పొరపాటుగా ఉత్తరం విషయం తెచ్చాను. ఆ అది నీకిష్టం లేదని తెలుస్తోంది. అయినా నా ఉత్సాహం కొద్దీ నిన్ను బాధ పెట్టవలసి వచ్చింది. ఇంక అడగనులే' అన్నాను. జరిగిన దానికి క్షమించమనీ అడిగాను.

విశ్వం చాలా బాధపడ్డాడు.

'నువ్వే నన్ను క్షమించాలి. ముందు రెండు సార్లు అడిగినప్పుడు నాకు నిజంగా తెలీదు కాని ఇందాక అడిగినప్పుడు నాకు తెలుసు. తెలిసే కూడా నీకు చెప్పలేదు. కేవలం నీ ఉత్సాహాన్నీ, ఉత్కంఠ నీ క్లైమాక్సుకు తీసుకు రావాలనే ఉద్దేశంతోనే చెప్పలేదు. నాకీమధ్యనే తెలిసింది.' అన్నాడు.

'ఎవరు ?' అన్నాను.

'ముందు నువ్వు అనుమానితులన్నావు ?' ఎవరో చెప్పు.

'అయితే ఆగు నువ్వు చెప్పకు ఉత్తరం రాసిందెవరో నాకు తెలుసు. ప్రభాకరం' అన్నాను చిన్న పిల్లాడిలా కంగారుగా.

నిశ్చయంగా ఇతనే అయుండాలి. నేను నాయుడు గారి అబ్బాయిని అనుమానిస్తున్నట్లు విశ్వానికి తెలీదు.

'కాదు' అన్నాడు విశ్వం.

'కాదు కాదు. వెరీ సారీ, పొరపాటు ప్రభాకరం అంటే కరుణ బావగారు. కాదు... అతనూ కాదు. నాయుడుగారబ్బాయేమో.' అన్నాను.

విశ్వం తల అడ్డంగా తిప్పాడు.

నాకు కోపం వచ్చింది ఓడిపోతున్నందుకు 'నువ్వే' అన్నాను.

విశ్వం అందంగా నవ్వాడు. తల అడ్డంగా వూపి చెవులో ఒక మాట చెప్పాడు.

నా చెవులని నేను నమ్మగలిగితే నేను విన్నమాట 'కరుణ' ★



''ఇదిగో ! దొంగాడా ! నీ ఖర్మకాలి యీ కొంపకి వచ్చావు ! అదిగో'' ఆ బల్లకింద వున్న హార్మోనీ పెట్టె తీసుకుని పో ! దొంగా అని అరవకుండా వదిలేస్తా !!''